

# అక్షింతలు

**- డా.వి.ఆర్.రాసాని**

ఉగాది పోటీలో ఎంపికైన కథ





ఊరి చివర వున్న గుడిలో...

డప్పుల శబ్దం... డోలు, సన్నాయి గూబలదరగొడుతున్నాయి. అది చాలదన్నట్లు గుడి ముందర వేసివున్న పందిరి గూటానికి చివర, అప్పుడే విచ్చుకున్న పెద్ద గోగు పువ్వులా కనిపిస్తున్న లౌడ్ స్పీకర్‌లోనుంచీ "బంగారు బొమ్మ రావేలా- పందిట్లో పెళ్ళి జరగాలా"అనే పాత సినిమా పాట రెట్టింపు శబ్దంతో వినిపిస్తోంది. చుట్టుపక్కల గ్రామాలకు ఆ పాటను గాలి అలలు అలలుగా ప్రసారం చేస్తోంది.

ఆ పందిరి కింద...

తలపాగకు కట్టిన బాసికంతో తన నల్లటి శరీరాన్ని, తెల్లటి బట్టల్తో చుట్టుకొని పెళ్ళి పీటపైన కూర్చొని వున్నాడు పెళ్ళికొడుకు తంగమణి. తెల్లటి పట్టుచీరలో మరో పీటపైన తల వంచుకొని, సిగ్గుతో వదిగి కూర్చొని వుంది కొత్త వధువు అలివేలు.

"అప్పుడూ అదే గుడి. అదే పలకలు... అదే డోలూ, సన్నాయి మేళం. అప్పుడూ అదే పాట. "బంగారు బొమ్మ రావేలా..."

తమ కొట్టం లోని నిట్రాతి కానుకొని సూన్యం లోకి చూస్తూ... ఆలోచనలతో గతాన్ని దహించుకుంటూ కూర్చొని వుంది భాగ్యమ్మ.

"అదే గుడిలో... గంగమ్మ సాక్షిగా... అదే పెళ్ళికొడుకుతో... అంగరంగ వైభవంగా... నాకూ పెళ్ళాయె. యిప్పుడు? ఛట్" విసుగ్గా అటూ యిటూ కదలి, ఒక్క నిట్టూర్పు విడిచి ప్రక్కకు తల తిప్పింది.

పుష్టుగా తాగి ఓ మూలన పడి వున్నాడు తన తండ్రి మాదన్న.

"నన్ను కన్నోళ్ళకు కనికరం లేదు. నన్ను కోడలుగా చేసుకున్నోళ్ళకు కనికరం లేదు. ఈ ఊరి జనానికి సిగ్గులేదు."

తన మనసులోనే ఆ మాటను యిప్పటికి కొన్ని వందలసార్లు అనుకుని వుంటుంది భాగ్యమ్మ.

అలా అనుకున్నప్పుడంతా ఆమె కళ్ళు ఊట చెలమలవుతాయి. ఆ చెలమలు స్రవించిన కన్నీళ్ళు చెక్కిళ్ళ క్షేత్రాన్ని చిత్తడి చిత్తడి చేస్తాయి.

భాగ్యమ్మకు పదిహేనేళ్ళు.

నల్లగా... నిగనిగ మెరిసే మేని నిగారింపుతో... చక్కటి ముక్కూ మొహంతో, విశాలమైన నేత్రాలతో నల్ల రాతితో చెక్కిన సుందర శిల్పంలా వుంటుంది భాగ్యమ్మ.

చెట్లంట, పుట్లంట, పొలాల గట్లంట పనీపాటా చేసుకుని తిరిగే భాగ్యమ్మకు ఊహ తెలియని వయసులో తన మేనమామ కొడుకు తంగమణితో పెళ్ళయింది. అప్పుడతనికి పదహారేండ్లు. భాగ్యమ్మకు ఎనిమిదేండ్లు. ఏమీ తెలియని వయసు.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళహస్తికి కొంత దూరంలో వున్న బ్రాహ్మణపల్లి దళిత వాడలో మాదన్నా లచ్చుమమ్మ దంపతులకు కొడుకు పుట్టిన చాలా ఏండ్లకు గారాల పట్టిగా పుట్టింది భాగ్యమ్మ. తన అన్న అయిన సుంకన్నకు శివరాత్రినాడు కాళహస్తి గుడిలో పన్నెండేళ్ళ వయసులో పెళ్ళయింది. ఇప్పుడు సుంకన్న ముగ్గురు పిల్లలున్న పాతికేళ్ళ తండ్రి.

కురవ సిద్ధారెడ్డిగారింట్లో సేద్యగాడుగా పెళ్ళాం పిల్లల్తో, అక్కడే బతుకుతున్నాడు సుంకన్న. ఆతను ఏనాడూ భాగ్యమ్మను పట్టించుకోలేదు. కారణం ఆతనిది బానిస బతుకు. రెడ్డిగారిచ్చే జీతం సంసారానికే మాత్రం చాలడంలేదు. భార్యాభర్తలు ఎంత కష్టపడినా కడుపులు నిండేదే కష్టంగా వుంది.

తండ్రి మాదన్న పక్కా తాగుబోతు. ఆతనికి కడుపే కైలాసం. మందే మహా భాగ్యం. ఎప్పుడూ ఏ నాటు సారానో, కల్లో తాగి గుడ్లు మిటకరిస్తుంటాడు.

మాదన్న అయిదేండ్ల క్రితంవరకూ సిద్ధారెడ్డిగారింట్లో గొర్రెలు మేపే జీతగాడుగా వుండేవాడు. ఒక రోజు గొర్రెలు తోలుకొని అడవి మొగదలవున్న బీళ్ళలో మేపుకుంటున్నాడు. ఆ బీటికి ఒకవైపు వరి మళ్ళు, వేరుశనగ తోటలు నల్లగరుగు పైనున్నాయి. రాగి కర్రలు పొట్ట కర్ర మీదున్నాయి. ఆ బీటికి మరో ప్రక్క తాటి చెట్లున్నాయి. ఆ తాటి చెట్లకు ఈడిగ వాళ్ళు కట్టి వున్న కల్లు ముంతలు పెద్దపెద్ద తాటికాయల్లా వ్రేలాడుతున్నాయి. వాటిని చూడగానే మాదన్నకు నోరూరింది. చుట్టుపక్కలా చూశాడు. ఎక్కడా మనిషి అలికిడే లేదు. గొర్రెలు బీట్లో గరిక పోచల్ని పీకి పీకి నముల్తున్నాయి. మాదన్న మెల్లగా ఒక తాటి చెట్టు కాడికి వెళ్ళి, ఎలాగో ఎక్కి కల్లుముంతను దించాడు. అందులో సగానికి పైగా కల్లు వడిగి వుంది. అయితే ఒక తొండ అందులో పడి చచ్చిపోయింది. కల్లు ముంతల్లో ఇవన్నీ మామూలే అనుకుని మునివేళ్ళతో తొండను తీసి అవతల పారేసి, ముంతను నోటికి కరిపించుకుని గుటగుట తాగేశాడు. కల్లును ఎంత వేగంగా కడుపులోకి పోసేశాడో, అంతే వేగంగా నిషా నసాలానికెక్కింది. అంతే తాగిన చోటే నేలపైన పడి కదలకుండా మెదలకుండా వుండిపోయాడు.

గొర్రెలు బీట్లో మేసినంత సేపు మేసి, వరిమళ్ళల్లో కొన్ని వేరుశనగ చెట్లల్లో కొన్ని జారబడి పంటను తినసాగాయి. అప్పుడే అటువైపునకు వచ్చిన రైతులు ఆతన్ని చిత్తుగా తన్ని గొర్రెల్ని బందలదొడ్లో తోలేశారు. ఆరోజు రాత్రి పెద్ద రాద్ధాంతమైంది. సిద్ధారెడ్డి చింత బరకలతో మాదన్న వీపు చితగ్గొట్టాడు. అపరాధం చెల్లించి గొర్రెల్ని విడిపించుకున్నాడు. రైతులకు పంట నష్టం కట్టిచ్చాడు. అది అవమానంగా భావించిన రెడ్డి తన యింట్లో యింక పని చేయొద్దన్నాడు. కట్టిన సొమ్ముకు బదులుగా కొడుకుని జీతానికి పెట్టించుకున్నాడు.

అయినా మాదన్న తాగుడు మానలేదు. అప్పుడప్పుడూ కూలికి పోవడం, ఆ కూలీ డబ్బుల్తో తాగడం,

అదీ లేనప్పుడు భార్య పనీపాటాచేసి తెచ్చిన కాసుల్ని కూడా తన్ని లాక్కొని తాగేసి రావడం మామూలైపోయింది.

యిదేదీ తెలియని చిన్న వయసు భాగ్యమ్మది.

ఊరి పొలాలలో బీటి నేలల్లో ఊర్లో పిల్లల్తోబాటు ఎగురుకుంటూ తిరిగేది. ఆకాశంలో ఎగిరే పక్షుల్తో బాటు ఆమె మనసూ రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయేది. వర్షాకాలంలో ఆకాశంలో లేచిన మబ్బుల్లో ఊయలలూగేది. ఇంద్ర ధనుస్సుపైన కేరింతలు కొట్టేది.

ఊరిముందర... పిల్లల్తోబాటు తూనీగల్ని పట్టేది. వికసించే పువ్వుల్నీ, వాటిపైన వాలే సీతాకోక చిలుకల్ని తన్మయత్వంతో చూసేది. అన్నెం పున్నెం తెలియని వయసు. అల్లరల్లరిగా ఆడే వయసు. తండ్రి పట్టించుకునేవాడు కాదు. తల్లి నిరంతరం శ్రమించేది.

ఒకసారి ఊర్లో కలరా వచ్చింది. యిద్దరు ముగ్గురు టపాకట్టేశారు. అది సర్దుకున్న తర్వాత చికున్ గున్యా జ్వరాలొచ్చి పడ్డాయి. ఒక విషగాలిలా జ్వరం ఊరి వాళ్ళను ఒక ఊపు ఊపేసింది. దాని దెబ్బకు కొందరు పిల్లలు, మరి కొందరు ముసలివాళ్ళు పాడెక్కేశారు. చాలామంది కీళ్ళ నొప్పుల్తో మంచాలు పట్టారు. పల్లె అల్లకల్లోలమై పోయింది. పల్లె పెద్దలు ఒకచోట చేరారు. ఇలా ఎందుకు జరిగిందో చర్చించుకున్నారు. కొందరు "దేశమంతా ఈ పాడు జ్వరాలే. మనకూ వచ్చాయి" అన్నారు. యింకొందరు వైద్యం అందించని ఆసుపత్రుల్నీ, డాక్టర్లను, ప్రభుత్వాలను తిట్టిపోశారు.

"ఆచారం తప్పడం వల్లనే యిట్లా జరగతా వుండాది" అన్నారు యింకొందరు.

"అందువల్లనే గంగమ్మకు కోపం వచ్చి కలరా వచ్చింది. ఈ జొరాలూ వచ్చినాయి" వత్తాసుగా అన్నారు మరి కొందరు.

"ఇవి పోవాలంటే అమ్మకు శాంతి చేయాల" అన్నారు ఊరివాళ్ళు. అసలు అమ్మకు ఎందుకు కోపం వచ్చిందని ప్రశ్నించుకుని దానికి కారణాన్ని షరా మామూలుగానే ఆలోచించారు.

ఊర్లో మొక్కుబడి వున్న వాళ్ళు ఎవరో తమ ఆడబిడ్డని బసివిని చేయకపోవడమే ఈ అనర్థాలకు మూలం అనుకున్నారు. మొక్కు చెల్లిస్తే ఈ కష్టం గట్టెక్కవచ్చని ఆలోచించారు. చివరికి ఆ ఆచారం, మొక్కుబడి మాదన్న యింట్లో వుందన్నారు.

ఆ విషయం విన్న భాగ్యమ్మ నిలువెల్లా వణికిపోయింది.

మాదన్నను పిలిపించారు. మాదన్న అప్పుడూ మత్తులోనే వున్నాడు.

"మీ యింట్లో అమ్మకు మొక్కుందా?" అడిగాడు కుల పెద్ద.

"అట్టే లేదు."అన్నాడు మాదన్న.

"వుంది. నిజం చెప్పు" గద్దించాడు కుల పెద్ద.

"వుంది" నత్తినత్తిగా సమాధానం చెప్పాడు మాదన్న.

"ఏందా మొక్కు?" మరో పెద్దమనిషి ప్రశ్నించాడు.

"వీళ్ళకు కొడుకు పుట్నప్పుడు, వాడికి ఏడో నెలలో సంధి కొట్టింది. దాన్నించీ బయటపడేస్తే, ఆ తర్వాత పుట్టే బిడ్డను బసివిని చేస్తామని అందరి ముందర అమ్మోరికి మీరు దీసి మొక్కు కట్టినాడు."

"పిల్లోడు బతికినాడు."

"ఆ తర్వాత భాగ్యమ్మ పుట్టింది."

"కానీ మొక్కు చెల్లించలా."

"ఆ మొక్కు మరిసిపోయి భాగ్యమ్మకు మేనల్లుడితో పెండ్లిగూడా చేసినాడు."

"అందుకే ఊరికి దూము తగిలింది."

ఒకరి తర్వాత ఒకరు చెప్పారు.

మాదన్నకు గుక్క తిరగలేదు. ఏమ్మాట్లాడాలో తెలీలేదు. మౌనంగా వుండిపోయాడు.

"భాగ్యమ్మకు చిన్నప్పుడే పెండ్లయిందిగదా." భయపడుతూనే అంది లచ్చుమమ్మ.

ఊర్లో మొక్కుబడి వున్న వాళ్ళు ఎవరో తమ ఆడబిడ్డని బసివిని చేయకపోవడమే ఈ అనర్థాలకు మూలం అనుకున్నారు. మొక్కు చెల్లిస్తే ఈ కష్టం గట్టెక్కవచ్చని ఆలోచించారు. చివరికి ఆ ఆచారం. మొక్కుబడి మాదన్న యింట్లో వుందన్నారు. ఆ విషయం విన్న భాగ్యమ్మ నిలువెల్లా వణికిపోయింది.

"మాతమ్మగా ముద్దరేయాల్సిన బిడ్డకు ఎవురు పెండ్లి జేయమన్నారు?" మళ్ళీ గద్దించాడు కుల పెద్ద.

"అట్ల జేసినారు గాబట్టే... ఊర్లో పని గిలుబడినాయి." మరో పెద్ద మనిషి నసిగాడు.

"చిన్నప్పుడు జరిగిన పెండ్లి పెండ్లీ గాదు. కట్టుకున్నోడు మొగుడూ గాదు. పో."

"వచ్చే మాఘలో భాగ్యమ్మను బసివిని చేయాల్సిందే."

పల్లె పెద్దలు నిర్ణయం చేశారు. ఆపైన ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఈ విషయం విన్న తంగమణి తండ్రి సుబ్బరాయలు "కాబోయే బసివి భాగ్యమ్మ. బసివంటే మాతమ్మ. వాడకంతా వదినె. యింక మన కోడలు కాదు. ఈ పల్లెకి ఉమ్మడి సొత్తు. దేవతామనిషి. అందుకే మాదన్నకు యింకో పెండ్లి జేయాల" అనుకున్నాడు.

సుబ్బరాయుడికిద్దరు అక్కచెల్లెండ్లు. అందులో పెద్దది లచ్చుమమ్మ. చిన్నది అలివేలు తల్లి. అలివేలుదీ భాగ్యమ్మ వయసే. ఆ అలివేలును తెచ్చి తంగమణికి పెండ్లి చేస్తున్నాడు.

* * *

గుడిలో పెండ్లి సంబరం...

కుల పెద్ద పెండ్లి తంతు నిర్వహిస్తున్నాడు.

అంతవరకూ... యింట్లో దిగాలుగా కూర్చొని వున్న భాగ్యమ్మ, మరోసారి తన తండ్రి వైపు చూసింది.

ఆతను మత్తులో చేతులు మాత్రమే కదిలిస్తూ... "అప్పనా తనామనా... అందరికీ దం...డా...ల...న్నా..." అంటూ పలవరిస్తున్నట్లు నత్తినత్తిగా పాట పాడుకుంటున్నాడు.

కన్నీళ్ళతో తడిసిన తన చెంపల్ని రెండు అరచేతుల్తో తుడుచుకుని పైకి లేచింది భాగ్యమ్మ.

దుఃఖం ఆగడంలేదు.

ఇన్ని రోజులూ తన మనిషి అనుకున్న తంగమణి నేటితో దూరమైపోతున్నాడని బాధ. తలుచుకునేకొద్దీ ఏడుపు తన్నుకొస్తోంది. వస్తున్న ఏడుపును ఆపుకోవడంతో ఆయాసం వస్తోంది. ఆయాస పడుతూనే ఒక్కసారి తన శరీరాన్ని చూసుకుంది.

అప్పుడే పొంగులు వారుతున్న కొత్త యవ్వనంతో ఎగిరెగిరి పడుతోంది ఎద. చెదరిపోయిన జుట్టు ముఖానికి అడ్డొస్తుంటే... రెండు చేతులతో జుట్టును వెనక్కి తోసి ముడివేసుకోసాగింది. సంకలో జాకెట్టు కుట్లు పగిలిపోయి తళుక్కున తొంగి చూస్తోంది వయసు. అదేదీ గమనించే స్థితిలో భాగ్యమ్మ లేదు.

మెల్లగా వీధిలోకి వచ్చింది. పైట జారిపోసాగింది. పైటంటే అది పైటకాదు. ఆరు నెలల క్రితం తను పెద్ద మనిషయితే తల్లి లచ్చుమమ్మ తన దాపుడుకోకను రెండుగా చీల్చి, అందులో ఒక ముక్కను తనకు పైటగా కప్పిన చీరగుడ్డ అది.

జారిపోతున్న ఆ గుడ్డను ఎదపైకి లాగి నడుముకు చుట్టి బిగించుకుంది. వీధి చివరవున్న గంగమ్మ గుడి ముందర వేసివున్న పెండ్లి పందిరి టెంకాయ కీతుల్తో పచ్చంగా కనిపిస్తోంది. దానికింద మూగిన జనం వీధి దాకా వ్యాపించి వున్నారు.

డప్పులు, మేళాలు ఆగిపోయాయి. లవుడ్ స్పీకర్ మౌనం వహించింది కానీ, అందులోనుంచీ పాటలకు బదులుగా పౌరోహిత్యం నెరుపుతున్న కుల పెద్ద మాటలు వినిపిస్తున్నాయి.

"తంగమణి, అలివేలు మనువుకి శెలవా?"అని పెళ్ళికొచ్చిన జనాన్ని అంగీకారం అడుగుతున్నాడతను. ఆ మాటకు తమ అంగీకారం తెలుపుతూ "సామి శెలవ్!" అన్న అందరి మాటలు లవుడ్ స్పీకర్లో ఒకేసారి గట్టిగా వినిపిస్తున్నాయి.

అలా మూడుసార్లు కుల పెద్ద అంగీకారం అడగడం, వచ్చిన జనం 'సామిశెలవ్' అంటూ అనడం వినిపిస్తూనే వుంది.

"పలకలు మేలాలు వాయించండీ..."

గట్టిగా వినిపించింది కుల పెద్ద కంఠం.

ఆ మరుక్షణం మళ్ళీ వాద్యాల హోరు!

భాగ్యమ్మ గుండెల్లోను హోరు!

తట్టుకోలేకపోతోంది. అప్రయత్నంగానే పెళ్ళిపందిరి వైపు నడిచింది భాగ్యమ్మ.

ఆమెనెవరూ గమనించడం లేదు. కనీసం పలుకరించడం లేదు. అసలామె మనిషన్న స్పృహకూడా ఎవ్వరికీ లేనట్లుంది. ఎవరి ఆనందంలో వాళ్ళున్నారు. ఎవరి ఉత్సాహంలో వాళ్ళున్నారు.

ఏడ్చి ఏడ్చి ఆమె కన్నీళ్ళు కూడా యింకి పోయినట్లున్నాయి. కన్నీళ్ళు కారడం లేదు. దుఃఖం కూడా కలగడం లేదు.

అందర్నీ తోసుకుంటూ ముందుకు వెళ్ళింది.


పెళ్ళిపందిరి మధ్యలో... మెడలో పూల మాలల్తో నిలబడి వున్నారు తంగమణి, అలివేలు.

వాళ్ళకెదురుగా తలకు తలగుడ్డ చుట్టుకొని, మైకు చేతబట్టుకొని నిలబడి వున్నాడు కుల పెద్ద.

అలివేలు తల్లి, తన పినతల్లి కూడా అక్కడే వుంది. తనను కన్న తల్లి లచ్చుమమ్మ అక్కడే హడావుడిగా తిరుగుతోంది. (మిగతా 21వ పేజీలో)

# పచ్చదనంతో ఆస్తమా మాయం

నగరాలు, పట్టణాలు కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయి. రోడ్ల విస్తరణ పేరుతో చెట్లను పెకలిస్తున్నారు. రహదారుల పక్కన ఉన్న విధంగానే, నగరాల్లోనూ రోడ్లకు ఇరువైపులా పచ్చటి చెట్లు ఉంటే కంటికి ఆహ్లాదకరంగా ఉంటుంది. కేవలం అందంగా కనిపించడానికో, చల్లటి గాలి కోసమో ఈ చెట్లు ఉపయోగపడతాయని అనుకుంటే తప్పే. నగరాల్లో నివసించే పిల్లల్లో వాతావరణ కాలుష్య కారణంగా కనిపించే ఆస్తమా వ్యాధికి రోడ్ల పక్కన ఉండే చెట్లు దివ్యమైన ఔషధంగా పని చేస్తాయంటే ఆశ్చర్యం కలగక మానదు. కొలంబియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు ఇటీవల నిర్వహించిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. పచ్చదనం ఎక్కువగా కనిపించే ప్రాంతంతోపాటు, రోడ్లకు ఇరువైపులా చెట్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో నివసించే పిల్లల్లో ఆస్తమా లక్షణాలు తక్కువగా కనిపించాయని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. పచ్చదనం తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పిల్లల్లో ఆస్తమా కేసులు అధికంగా ఉన్నాయని తేల్చి చెప్పింది. ఆకాశాన్ని అందుకునే బహుళ అంతస్థుల భవనాలు, వాణిజ్య సముదాయాల కారణంగా నగరాలు, పట్టణాల్లో రోడ్లకు ఇరువైపులా చెట్లు ఉండడం అసాధ్యంగా మారింది. అంగుళం చోటు కూడా వదలకుండా నిర్మాణాలను చేపడుతున్న నేపథ్యంలో, మొక్కలు నాటడానికి, చెట్లు పెంచడానికి రోడ్లను మించిన అనువైన ప్రాంతాలు ఉండవనేది వాస్తవం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటే, వాతావరణ కాలుష్యం కొంతమేరకైనా తగ్గుతుందని. స్వచ్ఛమైన గాలి పీల్చే అవకాశం లభిస్తుంది. వాయు కాలుష్యంతోపాటు ఆస్తమా కేసులు కూడా తగ్గుతాయి. 1980 దశకం నుంచి మన దేశంలో ఆస్తమా కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా నగరాలు, పట్టణాల్లో నివాసం ఉండే కుటుంబాల్లో సగటున కనీసం ఒకరు ఆస్తమాతో బాధపడుతున్న వారే. వాతావరణ నిపుణుల సూచనల ప్రకారం ప్రతి చదరపు కిలోమీటర్‌కు 1,675 చెట్లు



ఉండాలి. మరో విధంగా చెప్పాలంటే, ఒక ఎకరా స్థలంలో కనీసం ఏడు చెట్లు అవసరం. కానీ, దేశంలోని పలు నగరాల్లో చదరపు కిలోమీటర్‌కు సగటున 109 చెట్లు మాత్రమే ఉన్నాయి. దీనిని బట్టి నగరాలు ఎంత వేగంగా కాంక్రీట్ జంగిల్స్‌గా మారుతున్నాయో అర్థమవుతుంది. స్వచ్ఛమైన గాలి కరవై, వాతావరణ కాలుష్యం పెరిగి, దాదాపు ప్రతి కుటుంబంలోనూ ఒకరో ఇద్దరో ఆస్తమా వ్యాధిగ్రస్తులు కనిపిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో చెట్లు ఎక్కువగా ఉంటే, ఆస్తమా కేసులు సగానికి సగం తగ్గుతున్నాయని వివిధ పరిశోధనలు తెలియచేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని మెరుగుపరచి, చదరపు కిలోమీటర్‌కు కనీసం 343 చెట్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే, ఆస్తమా కేసులు 29 శాతం వరకు పడిపోతాయని ఈ పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఎకరాకు సగటున 2 చెట్లు మాత్రమే ఉన్న ప్రాంతాల్లో నాలుగు నుంచి ఐదేళ్ల వయసు ఉన్న పిల్లల్లో కనీసం తొమ్మిది శాతం మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ఇదే, ఎకరాకు నాలుగు నుంచి ఐదు చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఆస్తమాతో బాధపడుతున్న పిల్లల సంఖ్య నాలుగు శాతం మాత్రమే. చల్లటి వాతావరణం ఉంటేనో, ఆహార అలవాట్లలో తలెత్తే సమస్యల కారణంగానో లేదా వంశ పారంపర్యంగానో పిల్లల్లో ఆస్తమా వ్యాధి సోకుతుందని నిన్నమొన్నటి వరకు అందరూ భావించేవారు. నగరాల్లో ఉండే ఎంతోమంది వేలాది రూపాయలు ఆస్తమాతో బాధపడుతున్న తమ పిల్లలకు వైద్యం నిమిత్తం ఖర్చు చేస్తున్నారు. అయితే, మొక్కలు నాటడం, చెట్లను పరిరక్షించడం వల్ల ఆస్తమా వ్యాధి తగ్గుముఖం పడుతుందని తాజా పరిశోధనల ద్వారా తెలుస్తోంది. స్వచ్ఛమైన గాలితో ఆస్తమాను అరికట్టవచ్చన్న కొలంబియా యూనివర్శిటీ శాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు నగర వాసులకు కొంత ఊరటనిస్తోంది. నగరాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా నిర్వహిస్తే, భవిష్యత్తులో ఆస్తమా వ్యాధి గ్రస్తుల సంఖ్యను తగ్గించగలుగుతాం. అంతేగాక, ఉన్న చెట్లను పరిరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తమ విద్యుక్త ధర్మంగా స్వీకరించాలి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలను కూడా హరించే ఆస్తమా మహమ్మారి నుంచి చిన్నారులను కాపాడడానికి, కనీసం ప్రతి రోడ్డుకూ ఇరువైపులా పచ్చటి చెట్లు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు సైతం ఈ మహా యజ్ఞంలో భాగస్వాములు కావాలి. ప్రతి పౌరుడూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణను చేపడితే, నగరాల్లో రోడ్లన్నీ పచ్చదనంతో కళకళలాడడమేగాదు, పిల్లలను ఆస్తమా బారిన పడకుండా నివారించగలుగుతాం. పరిసరాలేకాకుండా, నిత్యం ప్రయాణించే రోడ్లు కూడా పచ్చదనంతో నిండాలని కోరుకుందాం. మొక్కలు నాటి, కనీసం భావి తరాలనైనా ఆస్తమా నుంచి కాపాడుకుందాం.

- బిఎల్

---

(8వ పేజీ తరువాయి)

తన అన్నావదినలు కూడా అక్కడే నిలబడి వున్నారు. పినతండ్రి సుబ్బరాయుడు ఒక కంచు తట్టలో అక్షింతలు పట్టుకొని అందరికీ అందిస్తున్నాడు...

అందరూ అక్కడే వున్నారు. అందరి మధ్య...ఒంటరిగా తనూ అక్కడే వుంది. వాళ్ళందర్నీ చూస్తుంటే... తొలిసారిగా 'బసివి' అన్న పదానికి మెల్లగా అర్థం స్ఫురించినట్లయింది భాగ్యమ్మకు.

భాగ్యమ్మ ముందరికి వచ్చిన సుబ్బరాయుడు ఆమెనొకసారి ఎగాదిగా చూసి ఆమె చేతిలోను అన్ని అక్షింతలు పెట్టి వెళ్ళిపోయాడు. అంతవరకూ చేతబట్టుకొని వున్న తాళిబొట్టును తంగమణి చేతికిచ్చి "తాళి కట్టవయ్యా!"అంటూ పురమాయించాడు కులపెద్ద.

వాయిద్యాల జోరు హెచ్చింది.

అక్షింతలు వేసే వాళ్ళు వేస్తున్నారు. దీవించే వాళ్ళు దీవిస్తున్నారు. వెనక నుంచీ వేస్తున్న అక్షింతలు భాగ్యమ్మ పైనా పడుతున్నాయి.

భాగ్యమ్మ తన చేతిలోని అక్షింతల్ని ఒక్కసారి చూసుకుంది.

"తను ఏమని అక్షింతలు వేయాలి? ఎందుకు వేయాలి?"

తనను తాను ప్రశ్నించుకుంది.

ఆమెకు సమాధానం దొరక లేదు.

అక్షింతల్ని అలాగ పెట్టుకుంది.

"ఈ రాత్రి తంగమణి, అలివేలుకు శోభనం జరుపుతారు మాఘమాసంలో... మానాయన కంటే పెద్దోడయిన కుల పెద్దతోనో, లేకంటే అదే వయసులో వుండే ఊరి సర్పంచితోనో నాకూ కన్నెరికం జేయిస్తారు. వీళ్ళకు పెండ్లి. నాకు పెటాకులు. యిప్పుడేం చేయాల?"

తీవ్రంగా ఆలోచిస్తూ, అందర్నీ తోసుకుంటూ మళ్ళీ వీధిలోకి వచ్చింది.

లవుడ్ స్పీకర్లో పెళ్ళి పాట... పెళ్ళి పందిట్లో వాయిద్యాలు... చెవుల్ని బద్దలు కొడుతున్నాయి.

ఆమె తిన్నగా తమ యింటి ముందరికొచ్చింది.

లోపల తాగిన తండ్రి పాట ముద్దముద్దగా వినిపిస్తూనే వుంది.

ఆమె గుండె బద్దలయింది.

చేతిలోని అక్షింతల్ని గట్టిగా నేలకేసి కొట్టింది. ఆపైన ముందుకు కదిలింది.

అడుగులు వేగంగా పడుతున్నాయి.

ఆలోచనలూ వేగమందుకున్నాయి.

నడుస్తూనే వుంది భాగ్యమ్మ.

*(కాళహస్తి గుడిలో శివరాత్రి పర్వదినాన వివాహం చేసుకుంటున్న బాల వధువులకు... చిన్నప్పుడే మాతమ్మ ఆచారానికి బలైపోయిన చిన్నారి మాతమ్మలకు... ఈ కథ అంకితం)*